# అన్నమయ్య నాటకీయత

- ఎన్. నారాయణస్వామి

నమో నారాయణ నావిన్నపమిదిగో అని సద్భక్తితో వేడి, జ్ఞానయజ్ఞ మీగతి మోక్షసాధనము అని జ్ఞానబోధచేసి, నానాటి బ్రతుకు నాటకము అని వైరాగ్యప్రకటన చేసిన గళంతోనే పలుకుతేనెల తల్లి పవళించెను అంటూనూ, ఏమొకో చిగురుటధరమున అనీనూ పరమాద్భుతమైన శృంగారరసావిష్కరణ కూడా చేసిన రసహృదయుడు అన్నమాచర్యుడు. మన భారతీయులకీ శృంగారం కొత్తకాదు. కవిత్వంలో అసలే కాదు. శృంగారాన్ని రసరాజం అని రాసారు. పెద్ద పీటవేసారు. సంస్కృత కావ్యాల్లోనూ, నాటకాల్లోనూ, అంతెందుకు అన్నమయ్యకి కేవలం నూరు నూటయాభయేళ్ళ ముందువాడే జయదేవుడు. గీతగోవిందం పేరిట ఎనిమిది చరణాల అష్టపదులు ఇరవైనాలుగింటిని కూర్చి రాధాకృష్ణుల విప్రలంభ సంభోగశృంగారాలను బహుచమత్కృతులతో వర్ణిస్తూ ఏకంగా ఒక శృంగారప్రబంధమే రాశాడు.

అది సంస్కృతం అనుకోండి. మనకెలాగా పెద్దగా అర్థం కాదు. గీతగోవిందంలో నాయకుడు కృష్ణుడు వీర శృంగార పురుషుడని మనకి తెలిసినదే పైగా రాధ అతని ప్రియురాలే కాని ధర్మపత్ని కాదు. కాబట్టి అదంతా ఓ ముచ్చటలే అని సరిపెట్టుకోవచ్చు. అదీ కాకుండా అష్టపదులన్నీ నాటకంలోని మూడు పాత్రలైన రాధ, సఖి, కృష్ణుడు ఒకరికొకరు చెప్పుకునే మాటలు ....... కవి స్వంత గొంతుతో చెప్పే మాటలుకావు. అందుకని ఆ శృంగారంలోని గాఢతని అలా సరిపెట్టుకోవచ్చు.

మరి అన్నమయ్య పాటలు అలాక్కాదే ఇది అచ్చ తెనుగాయె, అంతా బట్టబయలేనాయె. నాయకుడా, ఆంధ్రుల ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరుడు. పోనీ, ఆయనా ఆ తానులో ముక్కేనని సరిపెట్టుకుందాం. నాయిక మాచల్లని తల్లి అలమేల్మంగ. దివ్య శృంగారమేయని ఎంత సర్ది చెప్పుకున్నా, కాస్త ఎబ్బెట్టుగా అనిపించదూ? పెద్దవాళ్ళ నడిగితే, తప్పు, ఇలాంటి పిదప బుద్ధుల ప్రశ్నలు వేస్తే కళ్ళు పోతాయ్ అంటారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు కూడా తమ సీడీల్లో ఇచ్చిన వ్యాఖ్యానంలో "దివ్యశృంగారంలో మలినానికి స్థానం లేదు. అందుకే తల్లి శృంగార లీలల్ని తనయుడు మరుగు లేక వర్ణించాడు" ఇట్లాంటి నమ్మలేని సోది యేదో చెబుతారు.

అదంతా సరేగాని ఈ వివరణలేవి అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలని అర్థం చేసుకోవడంలో నాకు ఉపయోగించలేదు సరికదా, అసంతృప్తినే మిగిల్చాయి. కొంత ఆలోచించిన మిదట నాకు ఒక ఆలోచన తట్టింది. అది మీముందుంచుతున్నాను. సరస హృదయులు దాన్ని పరిశీలించి నా ప్రతిపాదనలో ఏమన్నా పస ఉందో లేదో తేల్చాలి.

అసలు సంగతి ఏవిటంటే అన్నమయ్య మహాపండితుడే కాక గొప్ప ఊహాశక్తి ఉన్న కవి. అందులో సందేహం ఏమి లేదు. కావ్య నాటకాలం కార గ్రంధాలన్నీ బాగా తెలుసుకుని ఉంటాడు. కవిత్వం రక్తి కట్టాలంటే అందులో నాటకీయత..... డ్రామా... ఉండాలి. అందుకే కాబోలు కావ్యేషు నాటంక రమ్యం అన్నారు. ఈ సంగతి బాగా గ్రహించిన వాడు అన్నమయ్య ఎటొచ్చీ ఆయన రాయడానికి పూనుకున్నది శాకుంతలం లాంటి నాటకమూ కాదు, గీతగోవిందం లాంటి గీతప్రబంధమూ కాదు. ఒకదానికొకటి సంబంధం లేని మూడేసి చరణాల సంకీర్తన పదాలు ఆయన ఎంచుకున్న మాధ్యమం. బోలెడేసి పాత్రల్ని సృష్టించేందుకూ, సన్నివేశాలు కల్పించేందుకూ లేదు. ఏమి చెయ్యదలుచుకున్నా ఆ ఒక్క పాటలో.... ఆమూడు చరణాల్లోనే ఐపోవాలి. ఆయన బహు తెలివైన వాడు కూడా. అందుకే శృంగార సంకీర్తనలన్నీ తన గొంతుతో పాడలేదు. ఒక్కొక్క పాటకీ ఒక్కొక్క పాత్రని, పాత్రోచితమైన గళాన్నీ కల్పించాడు. శంకరాభరణం సినిమాలోని శంకరశాస్త్రిగారు అంటారు చూడండి, ఒక్కొక్క అనుభూతికీ ఒక్కొక్క నిర్దిష్టమైన స్వరముంది అని. అదన్న మాట.

పలుకు తేనెల పాటని పాడుతున్నది భక్తుడైన అన్నమయ్య కాదు. ఒక ప్రౌఢ స్త్రీ. నాయికకి పిన్నో, మేనత్తో, లేక చిన్నప్పటినుంచి పెంచిన దాసినో కావచ్చు. తెల్లగా తెల్లవారినా ఇంకా ఆదమరచి నిదురిస్తున్న నాయికని చూసి మురిపంగా నవ్వుకుంటోంది. కలికితనముల విభుని గలసినది గాన అనడంలో, "ఓసి దీని దుంప పిలకెయ్యా. నిన్నా మొన్నా నాకళ్ళముందు పరికిణీలు కట్టుకు తిరిగిన పిల్ల కాదూ ఇది? ఇంతలో ఎదిగి పోయిందే?" అనే ఆశ్చర్యంతో కూడిన మురిపం ఉంది. తెగని పరిణతులతో తెల్ల వారిన దాక జగదేకపతి మనసు జట్టిగొనె గాన అనడంలో, "హబ్బ, జగదేక పతి మనసు గెల్చుకోవడం అంటే మాటలా, మా అమ్మాయి గనక ఎంత

నేర్పుతో సాధించుకున్నది" అని కించిత్ గర్వంతో పాటు, అంత గొప్ప ఘనకార్యం సాధించడానికి ఎంత శ్రమపడిందో పిచ్చి పిల్ల, పోన్లే పడుకోనీ కాసేపు" అనే జాలి ఉంది. "కొంగు జారిన మెరుగు గుబ్బలొలయగ తరుణి" అనడంలో "అయ్యో, నిద్దట్లో పైట తొలగింది కూడా గమనించకోవడం లేదే" అని కొద్ది కంగారుతో పాటు "అమె అలసినది ఎవ్వరితో ననుకున్నారు, సాక్షాత్తు మన్మథుని తండ్రితో (అంటే నాయిక మన్మథుని తల్లి అని గూఢార్థం)" అని బుగ్గలు నొక్కుకునే విడ్డూరం ఉంది. ఆపాటలో ఒక్క "మగ దృష్టిలేదు" గమనించండి.

అన్నమయ్య శృంగార సంకీర్తన ఏదైనా ఈ దృష్టితో చూడండి. అందులో ఒక నిర్దిష్టమైన స్వరం మీకు వినబడుతుంది. వినబడకపోతే నన్నడగండి.